


నూతన భవనానికి భూమిపూజ

ప్రజాశక్తి-రామచంద్రపురం

మండలంలోని వెలంపాలేం పంచాయతీ పరిధిలో గల కంబాల చెరువు లో నిర్మించే నూతన భవనానికి మండల పరిషత్ అధ్యక్షులు అంబటి భవాని శనివారం భూమి పూజ చేశారు. టిటిడి నిధులు రూ.10 లక్షలతో ఇక్కడ నూకాలమ్మ ఆలయ భవనాన్ని నిర్మిస్తారని అన్నారు. ఈ కార్య క్రమం లో గ్రామ సర్పంచ్ టేకిమూడి సుజాత సత్యనారాయణ, ద్రాక్షారామ సర్పంచ్ కొత్తపల్లి అరుణ, ఎంపిటిసి సభ్యురాలు తుమ్మూరి సుబ్బలక్ష్మి,తదితరులు పాల్గొన్నారు.



శంకుస్థాపన చేస్తున్న ఎంపిపి భవాని

తాగునీటికి కటకట

- పది రోజులుగా నీళ్లురాక ఇబ్బందులు
- చర్యలు చేపట్టాలని కోరుతున్న

అప్పనిరాములంకలోని మధ్యగ్రూప్ కాలనీ వాసులు

ప్రజాశక్తి-రాజోలు

ఆ గ్రామంలో తాగునీటి ఎద్దడి తీవ్రంగా ఉంది. నీటి కోసం అక్కడ ప్రజలు నిత్యం అవస్థలు పడుతున్నారు. తాగునీటి సమస్య ఉందని అధికారులు, ప్రజాప్రతినిధులు దృష్టికి తీసుకెళ్లినా ఫలితం లేకపోయింది.సఖినేటిపల్లి మండలంలోని అప్పనిరాములంక గ్రామంలో 200 కుటుంబాలు ఉన్నాయి. గ్రామంలో మధ్యగ్రూప్ కాలనీలో నీరు కోసం నిత్యం ఇబ్బందులు పడుతున్నారు. గ్రామంలో రెండు రోజులకు ఒకసారి తాగునీటి సరపరా అయ్యేది, కాని పది రోజులు గా తాగునీటి సరఫరా కావడంతో కొంత మంది సుదీర్ఘ



కాలనీలో వాటర్ ట్యాంక్ దారా తాగునీటి సరఫరా

ప్రాంతాలకు వెళ్లి నీటిని తెచ్చుకుంటున్నామని మహిళలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇటీవల సఖినేటిపల్లి మండల పరిషత్ సమావేశంలో మా గ్రామంలో నీటి ఎద్దడి తీవ్రంగా ఉందని, తాగునీటి సమస్య పరిష్కారం చేయాలని అధికారుల దష్టికి మహిళలు తీసుకువెళ్లారు. ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేస్తామని హామీ ఇచ్చారు. కానీ, ఇప్పటికీ అమలు కాకపోవడంతో మహిళలు ఆవేదన వ్యక్తంచేశారు. గ్రామంలో నీటి ఎద్దడి తీవ్రంగా ఉందని, కొంత మంది ఇంటి వద్ద సొంతంగా వేసుకున్న బోర్లు నుంచి నీటిని తెచ్చుకుంటున్నామని చెబుతున్నారు. అలా అని ప్రతిసారీ నీటిని అడిగేందుకు ఇబ్బందిగా ఉందని మహిళలు చెబుతున్నారు. వాస్తవానికి వేసవిలో నీటి ఎద్దడి ప్రాంతాలను గుర్తించి ఆయా ప్రాంతాలకు తాగునీరు సరఫరా చేసే విధంగా అధికారులు చర్యలు చేపట్టాల్సి ఉంది. కానీ, ఆ దిశగా చర్యలు చేపట్టకపోవడంతో గ్రామీణ ప్రాంత ప్రజలకు తాగునీరు కష్టాలు తప్పడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి.

రోజువారీ కార్యకలాపాలకూ అవస్థే

తాగునీటి కొరతతో రోజువారి కార్యకలాపాలను పూర్తి చేసుకోవడం కష్టతరంగా మారుతోంది. దీనితో స్థానిక ప్రజల నీటి అవసరాలు తీరక తీవ్ర ఇబ్బందులుపడాల్సి ఉంది. దీనితో కాలనీలో ప్రజలు తమ అవసరాలను తీర్చుకోవడానికి మంచినీటి కోసం ఫిల్టర్ నీటి కేంద్రాల వద్దకు పరుగులు తీయాల్సి వస్తోంది. ఒక్కో వాటర్ డబ్బా(టిన్) రూ. 20 వెచ్చించి కొనుగోలు చేయాల్సి వస్తోంది. రోజుకు కనీసం అవసరాన్ని బట్టి రెండు నుంచి 6 టిన్‌లను కొనుగోలు చేయాల్సి వస్తోంది. నాలుగురోజులకు సరాసరిన నాలుగు టిన్‌లను వినియోగించాల్సి వస్తోంది. ఈ లెక్కన నాలుగురోజుల్లో కనీసం రూ.100 కేవలం తాగునీటి కోసం వెచ్చించాల్సి వస్తోంది.

డబ్బులు పెట్టి కొనుక్కుంటున్నాం



పది రోజులకోసారి నీరు వదులుతున్నారు. అంతర్వేది పాలెం నీటి పథకం నుంచి అప్పనిరాములంక నీటిని అందించేందుకు అండర్ గ్రౌండ్ షంప్‌ను నిర్మించారు. నీరు సక్రమ ంగా రాకపోవడంతో గ్రామంలో నీటి ఎద్దడి నెల కొంది. అత్యవసరాల కోసం నీటిని క్యాన్ రూ.20 పెట్టి కొనుక్కుంటున్నాం. తాగునీటి ఇబ్బందులపై అధికారులకు, పాలకులకు చెబుతున్నా పట్టించుకోవడం లేదు.

-పెదపాటి అరుణ, అప్పనిరాములంక

తాగునీటి సమస్యను పరిష్కరించాలి



గ్రామంలో తాగు నీటి ఎద్దడి తీవ్రంగా ఉంది. కాలనీ వైపు ఎక్కడ బోర్లు తవ్వినా నీరు పడడంలేదు. నీరు కోసం మహిళలు చాలా ఇబ్బందులు పడుతున్నారు. ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేయాలని కోరారు. పలుమార్లు అధికారులు, పాలకులు దృష్టికి తీసుకెళ్లినా ఫలితం లేకుండాపోయింది.ఇప్పటికైనా చర్యలు చేపట్టి తాగునీటి సమస్యను పరిష్కరించాలని కోరుతున్నా.

-సరేళ్ల శీరిష, అప్పనిరాములంక

కొత్తపేట డివిజన్ పరిధిలో సెక్షన్ 30 అమలు

ప్రజాశక్తి-కొత్తపేట

కొత్తపేట డివిజన్ పరిధిలో శనివారం నుంచి సెక్షన్ 30 యాక్ట్ అమలులో ఉందని డిఎస్‌పి కెవి.రమణ తెలిపారు. ఆయన మాట్లాడుతూ ఆ నిబంధనల ప్రకారం ముందస్తు అనుమతి లేకుండా సభలు సమావేశాలు ఊరేగింపులు వంటివి జరగడానికి వీల్లేదన్నారు. కొత్తపేట పోలీసు సబ్ డివిజన్ పరిధిలో ఉన్నటువంటి కొత్తపేట, రావులపాలెం, ఆలమూరు, ఆత్రేయపురం, పి.గన్నవరం, అంబాజీపేట, అయినవిల్లి, నగరం, రాజోలు , సఖినేటిపల్లి, మల్కిపురం పోలీస్ స్టేషన్ల పరిధిలో ఉన్నటువంటి ప్రాంతాలకు ఇది వర్తిస్తుందన్నారు. కొత్తపేట పోలీస్ సబ్ డివిజన్ పరిధిలో ఉన్నటువంటి ప్రాంతాలలో శనివారం నుంచి సెక్షను 30 పోలీస్ యాక్ట్ ఉత్తర్వులు అమలులో ఉంటాయన్నారు. వీటి ప్రకారం ముందస్తు అనుమతి లేకుండా సభలు, సమావేశాలు, ఊరేగింపులు వంటివి జరపడానికి వీలు లేదని, అటువంటివి జరపాలంటే కొత్తపేట సబ్ డివిజన్ పోలీస్ అధికారి వద్ద ముందుగా అనుమతి పొందవలసి ఉంటుందన్నారు. ఈ నిషేధాజ్ఞలు జూన్ 30వతేదీ వరకు అమలులో ఉంటాయని సబ్ డివిజన్లోని అందరూ ఈ విషయాన్ని గమనించాలన్నారు. శాంతి భద్రతల పరిరక్షణలో భాగంగా తీసుకుంటున్న చర్యలకు అందరూ సహకరించాలన్నారు.

రామచంద్రపురం సబ్ డివిజన్ పరిధిలో..

రామచంద్రపురం డివిజన్ పరిధిలో సెక్షన్ 30అమలులో ఉంటుందని శనివారం పోలీసులు విడుదల చేసిన ప్రకటనలో పేర్కొన్నారు. నిబంధనల ప్రకారం ముందస్తు అనుమతి లేకుండా సభలు సమావేశాలు ఊరేగింపులు వంటివి జరగడానికి వీల్లేదన్నారు. రామచంద్రపురం పోలీసు సబ్ డివిజన్ పరిధిలో ఉన్నటువంటి రామచంద్రపురం, ద్రాక్షారామ, పామర్రు, మండపేట టౌన్, మండపేట రూరల్, రాయవరం, అంగర, పోలీస్ స్టేషన్ల పరిధిలో ఉన్నటువంటి ప్రాంతాలకు ఇది వర్తిస్తుందన్నారు. రామచంద్రపురం పోలీస్ సబ్ డివిజన్ పరిధిలో ఉన్నటువంటి ప్రాంతాల్లో శనివారం నుండి సెక్షను 30 పోలీస్ యాక్ట్ ఉత్తర్వులు అమల్లో ఉంటాయని, వీటి ప్రకారం ముందస్తు అనుమతి లేకుండా సభలు, సమావేశాలు, ఊరేగింపులు వంటివి జరపడానికి వీలు లేదన్నారు. అటువంటివి జరపాలంటే రామచంద్రపురం సబ్ డివిజన్ పోలీస్ అధికారి వద్ద ముందుగా అనుమతి పొందవలసి ఉంటుంది, ఈ నిషేధాజ్ఞలు ఈనెలాఖరు 30 వరకూ అమలులో ఉంటాయని సబ్ డివిజన్లోని అందరూ ఈ విషయాన్ని గమనిం చాల న్నారు. శాంతి భద్రతల పరిరక్షణలో భాగంగా తీసుకుంటున్న చర్యలకు అందరూ సహకరిం చాల న్నారు. ఈ నిషేధాజ్ఞలు ఉల్లంఘించిన వారిపై చట ప్రకారం చర్యలు తీసుకుంటామన్నారు.

ఘనంగా శాంతకుమారి పుట్టినరోజు

ప్రజాశక్తి - అంబాజీపేట

ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా సర్పంచ్‌ల సమాఖ్య అధ్యక్షురాలు నాగాబత్తుల శాంతకుమారి పుట్టినరోజు వేడుకలు మాచవరం ఆమె స్వగృహంలో శనివారం టిడిపి శ్రేణులు ఘనంగా నిర్వహించారు. జిల్లా పరిషత్ మాజీ ఛైర్మన్ నామన రాంబాబు, రాష్ట్ర టిడిపి కార్యదర్శి డొక్కానాథ్‌బాబులు సర్పంచ్ శాంత కుమారి, సుబ్బారావు దంపతులకు పూలమాలలు వేసి శాలువాతో సత్కరించారు. అనం తరం కేకు కట్ చేసి శాంతకుమారికి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో మాజీ ఎఎంసి ఛైర్మన్ అరిగెల బలరామమూర్తి, మాజీ పిఎసిఎస్ అధ్యక్షులు గణపతి వీర రాఘవులు, మాజీ జెడ్‌పిటిసి సభ్యుటు బొంతు పెదబాబు, మండల టిడిపి ప్రధాన కార్యదర్శి గుడాల ఫణి, జిల్లా తెలుగు రైతు ఉపాధ్య క్షులు ఆరుమిల్లి లాల్ బాబు లు పాల్గొని శుభాకాంక్షలు తెలిపారు.



కేక్ కటింగ్ చేస్తున్న సర్పంచ్ దంపతులు

అక్రమ నిర్మాణం తొలగింపు

ప్రజాశక్తి-రాజోలు

కడలి గ్రామంలో ప్రభుత్వ స్థలంలో అక్రమంగా నిర్మించిన రేకు షెడ్డును రెవెన్యూ, పంచాయతీ అధికారులు శనివారం తొలగించారు. కడలి-అరవపాలెం రోడ్డులో నాగాబత్తుల నరసింహ రావు అనే రిటైర్డ్ ఆర్మీ ఉద్యోగి ప్రభుత్వ స్థలాన్ని ఆక్రమించుకుని వెనక ఉన్న రైతులకు దారి లేకుండా చేశారని వడ్డి మధు శేఖర్ అనే వ్యక్తి స్పందనలో ఫిర్యాదు చేశాడు. సమస్య పరిష్కారం కాకపోవడంతో మధు శేఖర్ హైకోర్టును ఆశ్రయించాడు. హైకోర్టు ఆదేశాల మేరకు రాజోలు తహశీల్దార్ బి. ముక్తేశ్వర రావు విచారణ జరిపి కడలిలో సర్వే నెంబర్ 281 లో అక్రమంగా నిర్మాణం చేపట్టిన భూమి రోడ్లు, భవనాలశాఖకు చెందిన భూమిగా ధృవీకరించి తొలగించాలని ఆదేశాలు జారీచేశారు. శనివారం రాజోలు అర్ఐ శ్రీనివాస్ ఆధ్వర్యంలో పంచాయతీ కార్యదర్శి గెడ్డం కిరణ్ ప్రకాష్, విఆర్ఒ ఎ.శ్రీనివాస్, పంచాయతీ సిబ్బంది ప్రొక్లెయినర్ సాయంతో అక్రమ నిర్మాణాన్ని తొలగించి ప్రభుత్వ స్థలాన్ని స్వాధీనం చేసుకున్నారు.



కడలిలో ఆక్రమణలు తొలగిస్తున్న దృశ్యం

జోరుగా మట్టి అక్రమ తవ్వకాలు

ప్రజాశక్తి-అమలాపురం

అల్లవరం మండల పరిధిలో అక్రమ మట్టి తవ్వకాలు జోరుగా సాగుతున్నాయి. మైనింగ్ శాఖ అనుమతి లేకుండానే యథేచ్ఛగా మట్టి అమ్మకాలు కొనసాగిస్తున్నారు. అల్లవరం మండల పరిధిలో గుడాల, సామంతకుర్రు, అల్లవరం, కొమరగిరిపట్నం, బెండమూర్లంక ప్రాంతాల్లో మట్టి తవ్వకాలు సాగుతున్నాయి. మట్టి తవ్వకాలపై అధికారులు ఎవరు పట్టించుకోవడం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. రహదారులపై తనిఖీ చేస్తున్న సమయంలో మైనింగ్ శాఖ సిబ్బంది రూ.300 జరిమానా వేసి మట్టి తరలిస్తున్న ట్రాక్టర్లను వదిలేస్తున్నారు. ట్రాక్టర్లు నడుపుతున్న డ్రైవర్లకు కనీసం లైసెన్స్ లేకుండా అతివేగంగా వెళ్లడంతో ప్రమాదాలు చోటుచేసుకుంటన్నాయని పలువురు చెబుతున్నారు. రవాణా శాఖ అధికారులు గానీ ఇతర శాఖల అధికారులు గానీ పట్టించుకున్న దాఖలాలు లేవనిజిల్లా వ్యాప్తంగా ఒక్క కేసు కూడా నమోదు కాలేదనీ అన్నారు.



అల్లవరంలో మట్టి తరలిస్తున్న ట్రాక్టర్లు

12న 'మండపేట' మున్సిపల్ సమావేశం

ప్రజాశక్తి-మండపేట

స్థానిక పురపాలక సంఘ కార్యాలయంలో మున్సిపల్ కౌన్సిల్ సాధారణ సమావేశం ఈనెల 12న జరుగుతుందని ఛైర్‌పర్సన్ పతివాడ నూక దుర్గారాణి శనివారం తెలిపారు. సమావేశానికి కౌన్సిల్ సభ్యులు, అధికారులు హాజరుకావాలన్నారు.

నియోజవర్గ ప్రజలకు అందుబాటులో ఎంఎల్‌సి తోట

ప్రజాశక్తి-మండపేట

ఎంఎల్‌సి తోట త్రిమూర్తులు మండపేటలోనే మకాం ఉండేలా స్థిర నివాసం ఏర్పాటు చేసుకున్నారు. నియోజకవర్గ ప్రజలకు నిరం తర అందుబాటులో ఉండాలన్న సంకల్పంతో ఇప్పటికే పట్టణంలోని పార్టీ కార్యాలయం పక్కనే గల అపార్ట్మెంట్ లో ప్లాటును కొనుగోలు చేశారు. శనివారం సతీమణి సూర్యకుమారి, కుమారుడు పృథ్వీరాజ్, కుటుంబ సభ్యులతో కలిసి ఆయన గృహప్రవేశం చేశారు. స్వగ్రామం రామచం ద్రపురం నియోజకవర్గంలోని వెంకటాయ పాలెం అయినప్పటికి మండపేట బాధ్యతలు చేపట్టిన తర్వాత పట్టణంలోని విజయలక్ష్మి నగర్లో నియోజకవర్గ స్థాయి కార్యాలయంతో పాటు మూడు మండల కేంద్రాల్లోను పార్టీ కార్యాలయాలు తెరిచి ప్రజలకు అందు బాటులో ఉంటు న్నారు. ఎంఎల్‌సి తోట మండపేటలోనే స్థిర నివాసం ఏర్పాటు చేసుకోవడం పార్టీ శ్రేణులకు ఆనందం వ్యక్తం చేశారు. తాజాగా పట్టణంలో సొంత ప్లాటు లోకి ఎంఎల్‌సి తోట గృహ ప్రవేశం చేశారు. అనంతరం పూజలు నిర్వహించారు కార్యక్రమానికి ఛైర్ప ర్సన్ పతి వాడ దుర్గారాణి తదితరులు హాజరయ్యారు.

కార్టూ'నిజం'



అతలాకుతలం


- సాగునీరు వృథా
- పట్టించుకోని అధికారులు

ప్రజాశక్తి-కపిలేశ్వరపురం

మండల కేంద్రమైన కపిలేశ్వరపురం లో 1942 వ సంవత్సరం బ్రిటిష్ హయాంలో నిర్మించిన లాకులు శిథిలావస్థకు చేరుకున్నాయి 36,388 ఎకరాల ఆయకట్టుకు సాగునీరు అందించాలనే ఉద్దేశంతో నిర్మించిన లాకుల నిర్వహణ సక్రమంగా లేకపోవడంతో వాటి పరిస్థితి ఆగమ్యగోచరంగా మారింది. సాగు నీటి ప్రవాహాన్ని కట్టడి చేసి మెరక ప్రాంతాలకు నీరందించేందుకు నిర్మించిన ఇరిగేషన్ తలుపులకు రంధ్రాలు పడి లీకేజీల తో నీరు వృథాగా పోతోంది. ప్రస్తుత ఖరీఫ్ సీజన్లో సాగునీరు కొరతతో మెరక ప్రాంతాల్లో వరిచేలకు నీరు అందక రైతులు అనేక ఇబ్బందులు పడుతున్నారు. అయినా సంబంధిత అధికారులు వీటిని పట్టించుకున్న దాఖలాలు లేవు. ప్రస్తుతం ఇక్కడ ఎగువ లాకులు దిగువ లాకులు తలుపులు మూతబడి తెరుచుకునే కంట్రోలింగ్ సిస్టం సక్రమంగా పనిచేయడం లేదు. ఈ లాకులకు మరమ్మతులు చేసి తలుపులకు నూతన నిర్మాణం చేపట్టాలని అధికారులు నిర్ణయించి గతంలో టెండర్లు పిలిచారు. అయితే ఆ టెండర్ ప్రక్రియ జరగక పోవడం వల్ల నిర్ణయం మాత్రం అమలుకు నోచుకోలేదు. దీంతో సాగునీరు యథావిధిగా వృథా అవుతూనే ఉంది. ఇక్కడ పనిచేసేందుకు సిబ్బంది పూర్తిస్థాయిలో లేరు. ప్రస్తుతం లాక్ సూపరింటెండెంట్‌తో పాటు ఒక లస్కర్ లు మాత్రమే ఇక్కడ విధులు నిర్వహిస్తున్నారు. సిబ్బంది నిర్వహించేందుకు నిర్మించిన క్వార్టర్లు శిథిలావస్థకు చేరడంతో అవి నివాసానికి పనికి రాకుండా పోయాయి. దీంతో సిబ్బంది బయట ప్రాంతాల్లో అద్దెకు ఉంటూ ఇక్కడకు వచ్చి విధులు నిర్వహిస్తున్నారు ప్రాంతం అంతా విషసర్పాలకు నిలయంగా మారడంతో సిబ్బంది భయం గుప్పెట్లో విధులు నిర్వహిస్తున్నారు.



మరమ్మతుల కు గురై లాకుల తలుపులు



లాకుల తలుపుల రంధ్రాల నుండి వృథాగా పోతున్న సాగునీరు

సిబ్బందికి క్వార్టర్లు నిర్మించాలి

ఇప్పటికైనా సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు, తక్షణం స్పందించి లాకులకు మరమ్మతు పనులతో పాటు సిబ్బంది నివసించేందుకు క్వార్టర్లు నిర్మించాలని రైతులు, సిబ్బంది, మండల ప్రజలు కోరుతున్నారు.



దాతలకు చిత్రపటం అందిస్తున్న దృశ్యం

బాల బాలాజీ శాశ్వత అన్నదానానికి విరాళాలు

ప్రజాశక్తి-మామిడికుదురు

అప్పనపల్లి బాలబాలాజీ శాశ్వత అన్నదాన ట్రస్టుకు శనివారం పలువురు దాతలు విరాళాలు అందజేశారు. అంతర్వేదిపాలెం వాసులు చింతపల్లి వాసుదేవరావు, విజయ భాగ్యమణి దంపతుల కుమారుడు మను సాయి సూర్య గోపాలం పుట్టినరోజు సందర్భంగా రూ.10,100, యలమంచిలి వాసులు సన్నిధి వెంకట సుబ్రహ్మణ్యం, సీతామహాలక్ష్మి దంపతుల కుమారుడు సుహాస్ నాగశ్రీనివాస్ పుట్టినరోజు నిమిత్తం రూ.10,116 విరాళాలు గోశాల్లో గోవుల దాణా నిమిత్తం అందజేసినట్లు అందజేశారని ఆలయ ఇఒ డి.సాయిబాబు తెలిపారు. దాత దంపతులకు ధర్మకర్తల మండలి ఛైర్మన్ చిట్టూరి రామకృష్ణ స్వామివారి చిత్రపటాలు, ప్రసాదాలు ందజేశారు.

ఆదాయం రూ.3.50 లక్షలు

బాలబాలాజీ దేవస్థానం నందు శనివారం లడ్డు ప్రసాదం దర్శనం టికెట్లు విక్రయం ద్వారా రూ.2,69,586, నిత్యాన్నదాన ట్రస్టుకు రూ.80,786లు మొత్తం రూ.3,50,372 ఆదాయం సమకూ రినట్లు ఆలయ ఇఒ డి. సాయిబాబు తెలి పా రు. స్వామి వారిని 4,275 మంది దర్శిం చు కోగా 3,489మంది అన్న ప్రసాదం స్వీకరిం చారన్నారు.

వసతి గృహంలో చేరికకు దరఖాస్తుల స్వీకరణ

ప్రజాశక్తి-రాజోలు

నియోజకవర్గ పరిధిలో రాజోలు, మలికిపురం, సఖినేటిపల్లి, మామిడికుదురు మండలాల్లో టెన్త్‌లో పదవతరగతి ఉత్తీర్ణులైన, ఇంటర్, డిగ్రీ తో పాటు ఐటిఐ, పాలిటెక్నిక్, టిటిసి, బిఇడి, ఇంజినీరింగ్ వంటి వృత్తి విద్యా కోర్సులు చదువుతున్నారు. ప్రతి రోజు కళాశాల నుంచి ఇంటికి వెళ్లుటకు ఇబ్బందులు పడుతున్నారు. దూర ప్రాంత విద్యార్థుల కొరకు వెనుకబడిన తరగతుల సంక్షేమశాఖ ఆధ్వర్యంలో రాజోల్లో ఏర్పాటు చేసిన బిసి బాలుర వసతి గృహంలో చేరేందుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు వసతి గృహ సంక్షేమశాఖ అధికారి రాజేష్ తెలిపారు. ఎస్‌సి, బిసి, ఒసి, మైనార్టీలకు చెందిన విద్యార్థులు కళాశాల్లో చేరవచ్చు అని అన్నారు. దీనిలో భాగంగా కలశాల సిబ్బంది గెద్దాడ రామకృష్ణ మలికిపురం లక్కవరం, బట్టేలంక, ఆదుర్రు, మామిడికుదురు ప్రాంతాల్లో పలు కళాశాలలు తిరిగి వసతి గహంలో కల్పిస్తున్న సౌకర్యాలపై విద్యార్థులకు,వారి తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు.

మృతుల కుటుంబాలకు పరామర్శ

ప్రజాశక్తి-యంత్రాంగం

జిల్లాలో వివిధ కారణాలతో మృతి చెందిన కుటుంబాలను ప్రజాప్రతినిధులు, పలువురు నాయకులు శనివారం పరామర్శించారు. వివరాలు ఇవి..


అంబాజీపేట అంబాజీపేటలో పితృవియోగంలో ఉన్న మాజీ సొసైటీ అధ్యక్షులు కొర్లపాటి కోటబాబు ను శనివారం జెడ్‌పి ఛైర్మన్ విప్పర్తి వేణు గోపాలరావు పరామర్శించారు. సుబ్రహ్మణ్యం చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అలాగే ఇటీవల మతి చెందిన దొమ్మేటి శ్రీరాములు కుటుంబాన్ని పరామర్శించారు. శ్రీరాములు మతి పట్ల సంతాపం వ్యక్తం చేస్తూ కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలిపారు. ఆయన వెంట ఎంపిపి దొమ్మేటి వెంకటేశ్వరరావు, జెడ్‌పిటిసి సభ్యుడు బూడిద వరలక్ష్మి, ఎంపిటిసి సభ్యుడు ఎమ్. ప్రశాంత్, స్టేట్ అగ్రికల్చరల్ బోర్డు మెంబర్ జి.బాబి, మైలా ఆనందరావు, తదితరులు వారిని పరామర్శించిన వారిలో ఉన్నారు. **మండపేట** ఇటీవల మృతిచెందిన 29వ వార్డులోబండి అప్పాయమ్మ, మండలంలోని ద్వారపూడి, పాలతోడు, తాపేశ్వరం, మారేడుబాక గ్రామాలలలోని చేకూరి వెంకటేశ్వరరాజు, కోడి కోటి, ఓలపల్లి సత్యవతి కుటుంబాల సభ్యులను ఎమ్మెల్యే వేగుళ్ళ జోగేశ్వరరావు శనివారం పరామర్శించి వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. ఆయన వెంట టిడిపి నాయకులు ఉన్నారు. **రామచంద్రపురం** ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన యువకుల కుటుంబాలను పలువురు శనివారం పరామర్శించి, ఆర్థిక సాయం అందజేశారు. ఇటీవల రోడ్డు ప్రమాదంలో లో మృతి చెందిన వెల్ల గ్రామ యువకులు ఈత వరప్రసాద్, మర్రెడ్డి రాజేష్, గానుగుల సాయిరామ్‌ల కుటుంబ సభ్యులను శనివారం ఎపి రాష్ట్ర ఐక్య కాపునాడు జెఎసి అధ్యక్షులు వాదా ప్రసాద్ రావు, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ గాదంశెట్టి కొండలరావు, యర్రం శెట్టి రామరాజు కాపు పామర్తి నారా యణ మూర్తి సాధనాల చక్రపాణి, ఆకుల రమేష్ కోటిపల్లి గాదంశెట్టి సాయి మణికుమార్ పరామర్శి ంచారు. ఈత వరప్రసాద్ తమ్ముడు చదువుకి సంబంధించిన బాధ్యతను తీసుకుం టామని వారు హామీఇచ్చారు. నియోజకవర్గ కాపుఐక్యత ద్వారా బాధిత కుటుంబాలకు రూ.6వేల సాయం అందజేశారు.



వెల్లలో బాధిత కుటుంబాన్ని పరామర్శిస్తున్న నాయకులు



అంబాజీపేట లో పరామర్శిస్తున్న జెడ్‌పి ఛైర్మన్ తదితరులు




పలు కుటుంబాలకు పరామర్శిస్తున్న మండపేట ఎంఎల్ఎ వేగుళ్ల

రోగులకు ఉచిత వైద్యసేవలు

ప్రజాశక్తి - మామిడికుదురు(పి.గన్నవరం)

ముంగండపాలెంలో రాబిన్ హుడ్ ఆర్మీ మరియు సహాయ్ స్వచ్చంద సేవా సంస్థ ఆధ్వర్యంలో శనివారం ఆదిత్య హాస్పిటల్ వైద్య నిపుణులు పి.చంద్ర కిరణ్ రెడ్డి సీనియర్ ఫిజీషియన్ డయాబెటిస్ స్పెషలిస్ట్ చే వైద్య శిబిరం నిర్వహించారు. వంటెద్దు వెంకయ్య నాయుడు, కల్వకొలను తాతాజీ, కె.చిన్న నల్లా అజయ్, సంజయ్, తిక్కిరెడ్డి సురేష్ ల సహకారంతో వైద్య సేవలు అందించి రోగులకు అవసరమైన మందులు ఉచితంగా పంపిణీ చేశారు.ఈ కార్యక్రమంలో ర్యాబిన్ హుడ్ ఆర్మీ ప్రెసిడెంట్ ఎ.అశోక్ కుమార్, టీం సభ్యులు మోహన్, సాయి, శిరీష, దీపు, ఫణి, సుమంత్, మోజేష్, కావేరి, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.



సహాయ్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో వైద్య బృందం

ఘనంగా బాలకృష్ణ పుట్టినరోజు

ప్రజాశక్తి-అమలాపురం

హిందూపురం ఎంఎల్ఎ, సినీ నటులు నందమూరి బాలకృష్ణ పుట్టినరోజు వేడుకలను అమలాపురం శేఖర్ థియేటర్ ఆవరణలో శనివారం ఆయన అభిమానులు ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలలో టిడిపి ఉపాధ్యక్షుడు మెట్ల రమణబాబు హాజరై కేక్ కట్ చేశారు. అనంతరం ఇటీవల మరణించిన ఒక అభిమాని కుటుంబానికి రూ.15 వేల విరాళం అందజేశారు. నందమూరి సేవాసమితి అధ్యక్షుడు కంచర్ల రామకృష్ణ, గౌరవ అధ్యక్షుడు వాసంశెట్టి జగదీష్, ఉపాధ్యక్షుడు పసలపూడి శ్రీను, ఆవుపాటి గోపాల్, కార్యదర్శి వీర రాజశేఖర్, కోశాధికారి అక్కిసెట్టి శ్రీనివాస్, కర్రీ వెంకటేశ్వరరావు, చెక్క పరమేష్, కుమార్, టిడిపి కార్యకర్తలు పాల్గొన్నారు. **మండపేట** స్థానిక టిడిపి కార్యాలయంలో హిందూపురం ఎంఎల్ఎ, సినీ నటులు నందమూరి బాలకృష్ణ పుట్టినరోజు వేడుకలు ఎంఎల్ఎ వేగుళ్ల జోగేశ్వరరావు ఆధ్వర్యంలో శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఎల్ఎ వేగుళ్ల, పట్టణ టిడిపి అధ్యక్షులు ఉంగరాల రాంబాబుతో కలిసి కేక్ కట్ చేసి అందరికీ పంచిపెట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బాలయ్య నిండు నూరేళ్ల ఆరోగ్యంగా ఉండాలని కోరుకున్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు గుండు వీరతాత రాజు, వాచర్ల గుప్తా తదితరులు పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

గోదావరిలో గుర్తుతెలీని మహిళ మృతదేహం

ప్రజాశక్తి-తాళ్లరేవు

మండలంలోని గోవలంక గోదావరిలో గుర్తుతెలియని మహిళ మతదేహం స్వాధీనం చేసుకున్నట్టు కోరంగి ఎస్ఐ శ్రీనివాస్ కుమార్ తెలిపారు. గోవలంక వద్ద గోదావరి నదిలో ఒక గుర్తు తెలియని 30 ఏళ్ల మహిళ మృతదేహాన్ని స్వాధీనం చేసుకున్నట్టు తెలిపారు. మతురాలి కుడి చెయి పై ఒక వైపు శివ అని మరొక వైపు అమ్మ అనే పుట్టుమచ్చలు ఉన్నట్టు పోలీసులు తెలిపారు. ఆమె వివరాలు తెలిసినవారు 9440796558, 08842303533 నెంబర్లలో తెలియజేయాలని కోరంగి ఎస్ఐ శ్రీనివాస్ కుమార్ పేర్కొన్నారు.

ఆవులను తరలిస్తున్న వాహనం సీజ్

ప్రజాశక్తి-ఏలేశ్వరం


మండలంలోని తూర్పు లక్ష్మీపురం రహదారిలో ఆవులను అక్రమంగా తరలిస్తున్న వాహనాన్ని ఏలేశ్వరం పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు ఎస్‌హెచ్ఒ మాణిక్యం తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. ఏజెన్సీ ప్రాంతం నుండి ఎటువంటి అనుమతులు లేకుండా, తాళ్లతో బంధించి, నీరు మేత పెట్టకుండా తరలిస్తున్నారన్నారు. పశు సంరక్షణ సంస్థ మేనేజర్ దేవరపు మాణిక్యాలరావు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి ఎనిమిది ఆవులను, వాహనాన్ని స్వాధీనం చేసుకుని గోసంరక్షణశాలకు తరలించినట్టు తెలిపారు.

బంగారం, నగదు చోరీ

ప్రజాశక్తి-ఆత్రేయపురం

12 కాసులు బంగారం రూ.4.5 లక్షల నగదు చోరీ జరిగిన సంఘటనపై శనివారంఆ పోలీసులు కేసు నమోదు చేశారు. వారు తెలిపిన వివరాలు ప్రకారం మండలంలోని లొల్ల గ్రామం రజక పేటలో చెందిన ఉచ్చిలి వెంకటేశ్వరరావు ఈనెల 8న ఇంటికి తాళాలు వేసి తన భార్య ఇద్దరు కుమారులతో కలిసి తను మనవరాలు పుట్టినరోజు కు కాపవరం వెళ్లారు ఈ నేపథ్యంలో శనివారం ఇంటి తలుపులు తీసి ఉండడంతో పక్కింటి వారు ఫోన్ చేసి తెలుపుగా హుటా హుటిన ఇంటికి వచ్చారు. వరు చూసేసరికి బీరువా తలుపులు తెరిచి ఉండడంతో అందులో ఉన్న 12 కాసుల బంగారం, రూ.4 లక్షల50 వేలు లేకపోవడంతో పోలీసులకు సమాచారం అందించారు. సిఐ రజిని కుమార్, ఎస్ఐ సిహెచ్.సుధాకర్ తన సిబ్బందితో సంఘటన స్థలానికిచేరుకుని క్లూస్ టీం రప్పించి వేలిముద్ర లు సేకరించారు. దీనిపై బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన తెలిపారు సంఘటన స్థలాన్ని కొత్తపేట డిఎస్‌పి కెవి.రమణ పరిశీలించి వివరాలు అడిగి తెలుసుకున్నారు.

ఉద్యోగుల ఆశలపై నీళ్లు..



ప్రజాశక్తి- రాజమహేంద్రవరం ప్రతినిధి

రాష్ట్ర ప్రభుత్వం అవకాశవాద రాజకీయాలతో తమను మభ్య పెడుతోందనే అభిప్రాయం ఉద్యోగుల్లో వ్యక్తమవుతోంది. అధికారంలోకి వచ్చిన మొదటి వారంలోనే కాంట్రిబ్యూషనరీ పెన్షన్ స్కీంను రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని అమల్లో తెస్తామని ఇచ్చిన హామీని రాష్ట్ర ప్రభుత్వం అటకెక్కించిన విషయం విదితమే. నాలుగేళ్లుగా ఉద్యోగులు దశలవారీ ఆందోళనల నేపథ్యంలో కక్షసాధింపు చర్యలకు సైతం పాల్పడింది. తాజాగా జరిపిన చర్చల్లోనూ సిపిఎస్ రద్దుకు అంగీకరించినప్పటికీ దాని స్థానంలో జిపిఎస్ విధానం అమల్లోకి తెస్తామని చెప్పడం ఉద్యోగులను ఆందోళనకు గురిచేస్తోంది. ఈ నిర్ణయాన్ని సైతం కొన్ని ఉద్యోగ సంఘాలు స్వాగతించటంపై ఉద్యోగులలోనూ భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతోంది. మరోవైపు కాట్రాక్టు ఉద్యోగులను రెగ్యులరైజ్ చేస్తామని ప్రకటించిన విషయం విదితమే. అయితే 2014 జూన్ 2 నాటికి ఐదేళ్ల సర్వీసు ఉండాలనే నిబంధన అశనిపాతంగా మారింది. ఈ లెక్కన 2009లో వైఎస్ఆర్ ప్రభుత్వంలో కాంట్రాక్టు పద్ధతిన విధుల్లో చేరిన వారు మాత్రమే అర్హులని స్పష్టమవుతోంది. 2009లో సర్వీసులోకి చేరిన అత్యధిక మంది ఉద్యోగులు ప్రస్తుతం 50 ఏళ్ల వయసుకు చేరుకున్నారు. అధికారంలోకి రాగానే చేసినట్లయితే కొంతయినా మేలు జరిగేదని ఆయా వర్గాలు సైతం అభిప్రాయ పడుతున్నాయి. మరో వైపు ఔట్ సోర్సింగ్ ఉద్యోగులను సైతం రెగ్యులరైజ్ చేస్తామనే హామీని ప్రభుత్వం విస్మరించింది. ప్రభుత్వ లక్ష్యాలకు అనుగుణంగా ప్రజలకు సేవలందించే ఉద్యోగుల సమస్యలపై ప్రభుత్వాలు రాజకీయాలు చేయడంపై విమర్శలకు దారి తీస్తోంది.

వడగాల్పులు.. ఉక్కపోత..

ఎడా పెడా ఛార్జీల మోత మోగిస్తున్న ప్రభుత్వం వినియోగదారులకు విద్యుత్ సరఫరాపై దృష్టి సారించకపోవడంతో ఒకవైపు వడగాల్పులు, ఉక్కపోతతో ప్రజలకు అవస్థలు తప్పడం లేదు. గడిచిన వారం రోజులుగా సూరీడు నిప్పులు చెరుగుతున్నాడు. 43 డిగ్రీల సెల్సియస్ నుండి 45 డిగ్రీల సెల్సియస్ వరకూ ఉష్ణోగ్రతలు నమోదు అవుతున్నాయి. ఉదయం 9 గంటల నుంచే భానుడు తన ప్రతాపం చూపిస్తున్నాడు. దీంతో ఇళ్లలో నుంచి బయటకు రావాలంటేనే ప్రజలు సంశయిస్తున్నారు. మరో వైపు ప్రధాన కూడళ్లు సైతం 11 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకూ వెల వెల బోతున్నాయి. ఇళ్లలో, ఆఫీసుల్లో ఎసిలు, ఫ్రిజ్‌ల వినియోగం ఒక్కసారిగా పెరిగింది. దీంతో విద్యుత్ డిమాండ్ రోజుకు 19 వేల యూనిట్లు నుంచి 21 వేల యూనిట్లకు చేరింది. ఫలితంగా విద్యుత్ అంతరాయాలు పరిపాటిగా మారాయి. తొలుత పల్లెలకే పరిమితమైన విద్యుత్ అంతరాయాలు ప్రస్తుతం పట్టణాలల్లోనూ పరిపాటిగా మారాయి. మరో వారం రోజులు ఎండలు ఇదే విధంగా ఉంటే విద్యుత్ డిమాండ్ తగ్గట్లుగా సరఫరా చేసే అవకాశాలు తక్కువగా కన్పిస్తున్నాయి. ఇప్పటికే విద్యుత్ కోతల ఫలితంగా ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. రాబోయే రోజుల్లో సమస్య తీవ్రతరం అయ్యే పరిస్థితులు నెలకొన్నాయి. డిమాండ్‌కు తగ్గట్టు సరఫరా చేసేట్లుగా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

ఉమ్మడి జిల్లాలో వడి వడిగా నాట్లు

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు రైతుల సమస్యలపై చిత్తశుద్ధి కొరవడిందనే అభిప్రాయం రైతులలో వ్యక్తమవుతోంది. వ్యవసాయ రంగంలో కీలక భూమిక పోషించే జలవనరులను నిల్వచేసుకునేందుకు అవకాశాలు ఉన్నా ఆ దిశగా దృష్టి సారించడంలేదు. నిధులు లేక అనేక ప్రాజెక్టులు నీరసించి పోతున్నాయి. పోలవరం నిధుల కేటాయింపులపై కేంద్రం మొండి చేయి చూపిస్తున్న విషయం విదితమే. మరో వైపు కాటన్ బ్యారేజీ ఎగువన డ్రెడ్జింగ్ పనులకు రాష్ట్ర ప్రభుత్వం చొరవ లోపించింది. అయితే ముందస్తు పేరుతో జూన్1 నుంచి కాల్వలకు నీరు విడుదల చేసి రైతులు సిద్ధం కావాలంటూ ప్రకటనలు గుప్పించింది. రైతు భరోసా, యంత్ర సేవ పేరుతో రైతు గ్రూపులకు ట్రాక్టర్లు ఇతర ఉపకరణాలు అందజేసి ఆర్భాటంగా ప్రచారానికి పూనుకుంది. రైతులకు శాశ్వత ప్రయోజనాలిచ్చే అంశాలపై దృష్టి సారించకపోవడం చిత్తశుద్ధి లేమికి దర్పణం పడుతోంది. మరో వైపు ఏటా పెరుగుతున్న ఎరువులు, పురుగుల మందుల ధరలకు కళ్లెం వేయడం లేదు. దీంతో సాగు ఖర్చులు పెరిగిపోతున్నాయి. మరో వైపు కౌలు రైతులకు సాయం అందించే పరిస్థితులు లేవు. సాగు ప్రారంభం అవుతున్న ప్రస్తుత తరుణంలో పెట్టుబడులకు నగదు అందజేసి చిత్తశుద్ధి నిలుపుకోవాల్సిన అధికార యంత్రాంగం ఆ దిశగా చర్యలు తీసుకున్న దాఖలాలు లేవు. సిసిఆర్‌సి కార్డుల మంజూరులో నిబంధనలు సడలించి అందరికీ అందించేలా చర్యలు తీసుకోవాలని కౌలు రైతులు, రైతు సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి. గతేడాది ముందస్తు సాగు చేసినప్పటికీ ఆశించిన స్థాయిలో ఫలితాలు రాలేదు. గోదావరి వరదల కారణంగా అనేక పంటలు నేలమట్టం అయ్యాయి. కాల్వల ఆధునీకరణ, పూడికతీతలు లేకపోవటమే ఈ దుస్థితి కారణమని గత అనుభవాలు చెబుతున్నాయి. అయితే ఈ ఏడాది కూడా ఆధునీకరణ పనులు చేపట్టకపోవటం పాలకుల తీరును విమర్శల పాల్జేస్తుంది.

కాకినాడ సెజ్‌లో మల్టీప్రొడక్ట్ ఇండస్ట్రియల్ పార్కు ఏర్పాటుపై ప్రజాగ్రహం పెల్లుబికింది. ఈ వారంలో అధికార యంత్రాంగం ఏర్పాటు చేసిన అభిప్రాయ సేకరణ రాష్ట్రవ్యాప్తంగా చర్చనీయాంశమైంది. తీర ప్రాంతంలో సముద్రంపై ఆధారపడి సుమారు 50 వేల మత్స్యకార కుటుంబాలు ఉన్నాయి. కాలుష్య కారక పరిశ్రమలు రాకతో మత్స్య సంపద పూర్తిగా దెబ్బతింది. మత్స్యకార కుటుంబాలు వేటకోసం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ పరిస్థితుల్లో మరో నూతన పరిశ్రమలకు ఎర్రతివాచీ పర్చడంపై ఆగ్రహం వ్యక్తమవుతోంది. ప్రభుత్వ దుర్మార్గ వైఖరికి దర్పణం పడుతోంది.

యానాం వార్తలు

హోరాహోరీగా క్రికెట్ పోటీలు

ప్రజాశక్తి - యానాం

యానాం డిస్ట్రిక్ట్ క్రికెట్ అసోసియేషన్(వైడిసిఎ) ఆధ్వర్యంలో క్యాప్ టి-12 సూపర్ లీగ్ క్రికెట్ టోర్నమెంట్ -2023 స్థానిక మెట్టకూరు ప్రభుత్వ హైస్కూల్ క్రీడా మైదానంలో శనివారం సెమీఫైనల్స్ హోరాహోరీగా సాగాయి. అగ్ని లయన్స్, కెవిఆర్ జట్లు ఫైనల్స్‌కు చేరుకున్నాయని అసోసియేషన్ అధ్యక్షుడు పంతగడ సుమన్ బాబు తెలిపారు. ఆదివారం మధ్యాహ్నం ఇరుజట్లు తలపడనున్నాయని తెలిపారు. ముఖ్య అతిథులుగా ఆర్ఎఒ మునిస్వామి, మున్సిపల్ కమిషనర్, ఎస్‌పి, సిఐ, ఎఎస్ఐ పాల్గొని ప్రారంభిస్తారన్నారు.

వికలాంగులకు ఉచితంగా విద్య

స్థానిక బీచ్ రోడ్‌లో ఉన్న ఉమా ఎడ్యుకేషనల్ అండ్ టెక్నికల్ సొసైటీ మానసిక వికలాంగుల ప్రత్యేక పాఠశాలలో మానసిక దివ్యాంగులకు ఉచితంగా విద్యను అందిస్తున్నట్లు సెంటర్ కో ఆర్డినేటర్ కె.శ్రీనివాస్ తెలిపారు. ఈ మేరకు శనివారం పాఠశాల సిబ్బందితో నియోజకవర్గంలో సర్వే నిర్వహించారు. మానసిక దివ్యాంగులు, ఎదుగుదల లేని వారు, అంగవైకల్యం ఉన్న వారు ఉంటే సమాచారం అందించాలని కోరుతూ గ్రామాల్లో కరపత్రాలను పంచారు.

డ్రెయినేజీల పరిశీలన



యానాం పోలీస్ స్టేషన్ ప్రాంగణంలోని డ్రెయినేజీలను శనివారం ఎంఎల్ఎ గొల్లపల్లి అశోక్ అధికారులతో కలిసి పరిశీ లించారు. ప్రధానంగా స్థానిక పిల్లారాయవీధి రోడ్ నుంచి పోలీసు స్టేషన్ ప్రాంగణంలోని పోలీసు క్వార్టర్స్ వరకూ ఇటీవల డ్రెన్ నిర్మించారు. అయితే డ్రెన్లకు పలు చోట్ల ఏర్పాటు చేసిన మ్యాన్ హోల్స్‌పై ప్లేట్లు ఏర్పాటు చేయాల్సి ఉంది. ఈ ప్లేట్లు లేక డ్రెన్ లో పడిపోయే ప్రమాదం ఉన్న నేపథ్యంలో ఎంఎల్ఎ పరిశీలించారు. ప్రజాపనులశాఖ ఇఇ వీరసెల్వం, జెఇ నాగరాజు, తక్షణమే ప్లేట్లు నిర్మించే విధంగా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అధ్వానంగా ఉన్న ఎస్‌పి ఆఫీసు ప్రక్కన గల డ్రెన్ పరిస్థితిని పరిశీలించారు. ఈ డ్రెన్ నుంచి కాంప్లెక్స్ రోడ్డులోని ప్రధాన కాలవలోకి మురికినీరు వెళ్లే విధంగా పనులు చేపట్టాలని, వెంటనే తగిన చర్యలు తీసుకోవాలని ఇఇకి సూచించారు. నీరు నిలిచిపోకుండా పూర్తిస్థాయిలో డ్రెన్ పరిస్థితిని చక్కదిద్దాలన్నారు. సిఐ షణ్ముగం, ఎస్ఐ నూకరాజు, పి.సిద్దార్థ్ కుమార్, చిక్కాల నరసింహమూర్తి ఎంఎల్ఎ వెంట ఉన్నారు.

ఉపాధ్యాయులకు విద్యా ప్రణాళికపై శిక్షణ

నియోజకవర్గ ప్రభుత్వ పాఠశాలల్లో 2023- 24 విద్యా సంవత్సరానికి సంబంధించి సిబిఎస్ఇ సిలబస్‌ను ప్రభుత్వం అమలు చేస్తున్న నేపథ్యంలో విద్యా ప్రణాళికపై ఉపాధ్యాయులకు శనివారం సీబీఎస్ఈ ఓరియంటేషన్ శిక్షణ నిర్వహించినట్లు విద్యాశాఖ అధికారి పంపన లక్ష్మణ ప్రవీణ్ తెలిపారు.

ఆలయంలో ఎంఎల్ఎ గొల్లపల్లి పూజలు

యానాం పిల్లారాయస్వామి ఆలయంలో లంకా చంద్రరావు అధ్వర్యంలో శనివారం నిర్వహించిన ప్రత్యేక పూజల్లో ఎంఎల్ఎ గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆలయంలో పలు పూజలు నిర్వహించారు. ప్రజాపనుల శాఖ ఇఇ వీర సెల్వం, జెఇ నాగరాజు, జ్యోతిరాజు, సిఐ షణ్ముగం, దవులూరి శ్రీనివాస్ లయన్స్ క్లబ్ పిల్లారాయా అధ్యక్షులు పులవర్తి శ్రీను, చిక్కాల నరసింహమూర్తి, పండు సిద్దార్థ్ కుమార్, చెక్కల అరుణ్ కుమార్ పాల్గొన్నారు.

ఐక్యపోరాటాలతోనే రాజ్యాంగ పరిరక్షణ

ప్రజాశక్తి - అమలాపురం

మనువాదం, మతోన్మాదం పెచ్చురిల్లుతున్న నేపథ్యంలో దళితులు, మైనార్టీలు, బహుజనుల ఐక్యపోరాటంతో రాజ్యాంగాన్ని రక్షించుకోవాలని విసికె పార్టీ జాతీయ అధ్యక్షుడు, ఎంపీ తిరుమావలవన్ పిలుపునిచ్చారు. శనివారం సత్తెమ్మతల్లి లేఅవుట్‌లో ఆయన అధ్యక్షతన స్వయంపాలన సంకల్ప దీక్ష పేరుతో బహిరంగ సభను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. మరి కొన్ని నెలల్లోనే ఎన్నికలు రాబోతున్నాయన్నారు. దేశంలోను, రాష్ట్రంలోను రాజకీయ అధికారం చేజిక్కిచ్చుకోనేందుకు ఆధిపత్య కులాల పార్టీలు సన్నద్ధమవుతున్నాయన్నారు. రాష్ట్రంలో చంద్రబాబు మళ్లీ ముఖ్యమంత్రి కావాలనుకుంటున్నారన్నారు. తదనంతరం తన కుమారుడు లోకేష్‌కు ఆ పదవిని కట్టబెట్టాలని రాష్ట్రమంతా తిరుగుతున్నాడని తెలిపారు. వైఎస్ఆర్ రెండుసార్లు ముఖ్యమంత్రిగా చేశారు. ఆయన మరణానంతరం కుమారుడు జగన్మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా వచ్చారు, ఇప్పుడు మళ్లీ అధికారం కోసం ప్రయత్నాలు చేసుకుంటున్నారు. కాని వేల సంవత్సరాల నుండి అధికారానికి దూరంగా వున్న అణగారిన కులాలు రాజ్యాధికారం కోసం ఎటువంటి ప్రయత్నం చేయకపోవడం విచారకరమన్నారు. ఒక వైపు బిజెపి, ఆర్ఎస్ఎస్‌లు అంబేద్కర్ రాజ్యాంగానికి తూట్లు పొడుస్తున్నాయన్నారు. అసమానతను సుస్థిరం చేసే సనాతన ధర్మం పునాదిగా మరో రాజ్యాంగాన్ని అమలులోకి తీసుకురావాలని ప్రయత్నిస్తున్నాయన్నారు. పూలే,అంబేద్కర్ అణగారిన ప్రజల కోసం సాధించిన ప్రత్యేక హక్కులను ఒకే చట్టం పేరుతో కాలరాయాలని చూస్తున్నాయన్నారు. రోజురోజుకూ అణగారిన కులాల ప్రజలపై హత్యలు, అత్యాచారాలు పెచ్చుమీరుతున్నాయన్నారు. ప్రభుత్వం దోషులను అరెస్టు చేయడం మానేసి నష్టపరిహారం ఇచ్చి సరిపెడుతున్నాయన్నారు. దళిత ప్రజాప్రతినిధులు సైతం ప్రశ్నించే వీలుండట్లేదన్నారు. మనల్ని మనం పరిపాలించుకునే స్వయం పాలనతోనే వీటికి చెక్ పెట్టగలమన్నారు. తొలుత సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు మాట్లాడారు. దళితులు, బహుజనుల హక్కుల రక్షణ కోసం కలిసొచ్చే పార్టీలతో సిపిఎం పోరాడుతుందన్నారు. తమిళనాడులో విసికెతో సిపిఎం, సిపిఐలు కలిసి పనిచేస్తున్నాయన్నారు. బిజెపి అధికారంలోకొచ్చిన తర్వాత దేశంలో దళితులపై దాడులు విపరీతంగా పెరిగాయన్నారు. బిజెపి పెంచి పోషిస్తున్న ఆర్ఎస్ఎస్, భజరంగ్‌దళ్, విశ్వహిందూ పరిషత్ సంస్థలను దేశంలో నిషేధించాలన్నారు. ఈ కార్యక్రమంలో విసికె పార్టీ రాష్ట్ర అధ్యక్షులు విద్యాసాగర్, విశ్రాంత రైల్వే ఉద్యోగి భారత భూషణ్, ఆంధ్రజ్యోతి ఎడిటర్ కె.శ్రీనివాస్, విసికె పార్టీ తెలంగాణ ఇన్‌ఛార్జి జీలుకర శ్రీనివాస్, విశ్రాంత హైకోర్టు న్యాయవాది బాలయోగి, బి.రమణ తదితరులు పాల్గొన్నారు.

నేడు లబ్ధిదారులకు ఇళ్ల పట్టాల పంపిణీ

ప్రజాశక్తి-కాజులూరు

గృహ నిర్మాణాలకు సంబంధించి ఆదివారం ఉదయం పట్టాలు పంపిణీ చేస్తామని తహశీల్దారు బి.సాయి సత్యనారాయణ తెలిపారు. శనివారం మండలంలోని శలపాక గ్రామంలో తహసిల్దార్ సత్యనారాయణ విలేకరులతో మాట్లాడారు. మండలంలోని 5 గ్రామాలకు సంబంధించి శలపాక గ్రామంలో మంత్రి వేణుగోపాలకృష్ణ లబ్ధిదారులకు పట్టాలు పంపిణీ చేస్తారని అన్నారు. గొల్లపాలెం గ్రామానికి సంబంధించి 198, శలపాక గ్రామానికి సంబంధించి 141, తణుకువాడ గ్రామానికి సంబంధించి 34, మతకుమిల్లి గ్రామానికి సంబంధించి 29, బంధనపూడి గ్రామానికి సంబంధించి 53 మంది లబ్ధిదారులకు పట్టాలు పంపిణీ చేస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ వేగేశ్వరరావు, రెవెన్యూ అధికారులు ఈశ్వరరావు, సత్తిబాబు, గణికమ్మ, సత్యనారాయణ పాల్గొన్నారు.

ఇకపై నెలకో వార్డులో రచ్చబండ

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

ఇకపై నెలకో వార్డులో 'రచ్చబండ' కార్యక్రమాన్ని నిర్వహించి ప్రజా సమస్యలు తెలుసుకుని పరిష్కరిస్తానని ఎంపీ మార్గాని భరత్‌రామ్ తెలిపారు. శనివారం లలితానగర్ వినాయకుని గుడి వద్ద ఏర్పాటు చేసిన వైసిపి వార్డు కార్యాలయాన్ని వైసిపి నగర అధ్యక్షుడు అడపా శ్రీహరితో కలిసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీ భరత్ మాట్లాడుతూ నగరంలో ప్రతీ వార్డులో పార్టీ కార్యాలయాలను ఆయా వార్డు ఇన్‌ఛార్జుల ఆధ్వర్యంలో నిర్వహిస్తారని తెలిపారు. నగరంలో ప్రప్రథమంగా 37వ వార్డులో బాలాజీ రెడ్డి ఔదార్యంతో రెడ్డి సూరిబాబు, సుందర్‌సింగ్ ఆధ్వర్యంలో ఈ కార్యాలయం ఏర్పాటు కావడం సంతోషకరమన్నారు. ఈ కార్యక్రమంలో మార్గాని సురేష్, కాంతారాం పాటిల్, సంకిస భవానీ ప్రియ, ఎన్వీ శ్రీనివాస్, నక్కా నాగేష్, ప్రవీణ్ చౌదరి, మజ్జి అప్పారావు తదితరులు పాల్గొన్నారు.



చంద్రబాబు నుంచి ప్రశంసాపత్రం అందుకుంటున్న మహేష్

మహేష్‌కు ప్రశంసాపత్రం

ప్రజాశక్తి-అయినవిల్లి

టిడిపి జాతీయ కార్యాలయంలో రాష్ట్రస్థాయి సోషల్ మీడియా అభినందన సభ జరిగింది. పార్టీజాతీయ అధ్యక్షులు మాజీ సిఎం నారా చంద్రబాబు నాయుడు విచ్చేసి సోషల్ మీడియాలో చురుకుగా పనిచేస్తూ, టిడిపి కార్యక్రమాలను ప్రజల వద్దకు తీసుకెళ్తున్న వారికి పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో భాగంగా పి.గన్నవరం నియోజక వర్గం ఐటిడిపి అధ్యక్షులు అప్పారి మహేష్ ప్రశంసా పత్రం అందుకున్నారు. అప్పారి మహేష్‌కు పలువురు నాయకులు అభినందనలు తెలియజేశారు,

చోరీ గురైన సెల్‌ఫోన్ల రికవరీ

ప్రజాశక్తి -అమలాపురం

చోరీకి గురైన, పోగొట్టుకున్న మొబైల్ ఫోన్లను రికవరీ చేసి బాధితులకు 150 ఫోన్లు జిల్లా ఎస్‌పి యస్.శ్రీ ధర్ ఆయన కార్యాలయంలో శనివారం అందజేశారు. ఆయన మాట్లాడుతూ ఇటీవల కాలంలో మొబైల్ ఫోన్ల మిస్సింగ్ కేసులు ఎక్కువైనందున, పోగొట్టుకున్న మొబైల్స్ ను బాధితులకు అందజేసే నిమిత్తం, ప్రత్యేక బందాలను ఏర్పాటు చేసి, అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానం, మొబైల్ ట్రాకింగ్ వ్యవస్థ ద్వారా మిస్సింగ్ మొబైల్ ఫోన్లను గుర్తించి రికవరీ చేయడం జరిగిందన్నారు. చాట్ బోట్ సేవలు ప్రారంభించి, మూడవ దశ లో రూ. 30,00,000 విలువ చేసే 150 మొబైల్ ఫోన్లను రికవరీ చేసి శనివారం బాధితులకు వారి ఫోన్లను అందజేశామన్నారు. మొత్తంగా ఇప్పటివరకు 412 ఫోన్లను బాధితులకు అందజేశామన్నారు. తక్కువ వ్యవధిలోనే తిరిగి వారి ఫోన్ చేతికందడంతో బాధితులు ఆనందం వ్యక్తం చేస్తూ జిల్లా పోలీసు అధికారులకు, సిబ్బందికి కతజ్ఞతలు తెలిపారు. చాట్ బోట్ సేవలను ప్రజలు వినియోగించుకోవాలని, ఫోన్ చోరీకి గురయినా, మిస్ అయిన వారు, ఈ వాట్సాప్ నంబర్ 8522913300 కు హాయ్ లేదా హెల్ప్ అని మెసేజీ పంపాలన్నారు. ఇది ప్రారంభమే అని ఈ విధానము ప్రజలకు ఎల్లప్పుడు అందుబాటులో ఉంటుంది అని దీనిని ప్రజలు సద్వినియోగం పరచుకొని పోగొట్టుకున్న మొబైల్స్ ను పొందవచ్చన్నారు. ఎవరికైనా దొరికిన సెల్ ఫోన్ లను సొంతానికి వాడుకోవడం కాని, గుర్తు తెలియని వ్యక్తులు ద్వారా బిల్లులు లేని సెల్‌ఫోన్ లను కొనడం కాని చేయకూడదన్నారు. మీకు దొరికిన సెల్ ఫోన్లను దగ్గర లో ఉన్న పోలీసు స్టేషన్ కి అందజేయాలని జిల్లా ఎస్‌పి యస్. శ్రీధర్ తెలియజేశారు. ఈ సందర్భంగా అడిషనల్ ఎస్‌పి యస్. ఖాదర్ బాషా ఆధ్వర్యములో సెల్ ట్రాకింగ్ టీమ్ అయిన ఇన్‌స్పెక్టర్ ఆఫ్ పోలీస్ డి. గోవిందరావు, ఎస్‌బి ఇన్‌స్పెక్టర్ ఆఫ్ పోలీస్ కె.రజని కుమార్ , యస్ఐలు జి.నరేష్, జె. భానుప్రసాద్, సంపత్ కుమార్, ఫణి మోహన్, ఎఎస్ఐ బాలకృష్ణ, హెడ్ కానిస్టేబుల్స్ తదితరులను ఎస్‌పి అభినందించినారు.



దొంగలించబడిన సెల్ ఫోన్లు తిరిగి అందజేస్తున్న జిల్లా ఎస్‌పి

గణపతిరావుకు పలువురి పరామర్శ

ప్రజాశక్తి-అమలాపురం

భార్యావియాగంతో బాధపడుతున్న వన్నె చింతలపూడి కి చెందిన కుంచే గణపతిరావు ను అమలాపురం నియోజకవర్గ వైసిపి సీనియర్ నాయకుడు, గుడ్ సీడ్ ఫౌండేషన్ ఫౌండర్ కుంచే రమణారావు శనివారం పరామర్శించారు. గణపతిరావు భార్య అమ్మాజీ ఇటీవల ఆకస్మికంగా మృతి చెందారు. బాధిత కుటుంబ సభ్యులను రమణారావు, సర్పంచ్ నక్కా కృష్ణ తదితరులు పరామర్శించారు.



గణపతిరావును పరామర్శిస్తున్న దృశ్యం

దళిత నాయకుని కుటుంబానికి..

ఉప్పలగుప్తం ఇటీవల అనారోగ్యంతో ఉప్పలగుప్తం పంచాయతీ కామరాజుపేటకు చెందిన దళిత నాయకుడు తాళ్ల శత్రుఘ్నుడు మతి చెందారు.ఆ కుటుంబాన్ని శనివారం అమలాపురం నియోజకవర్గ జనసేన పార్టీ ఇన్ ఛార్జ్ శెట్టిబత్తుల రాజబాబు, నాయకులు పరామర్శించారు. శత్రుఘ్నుడు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సంతాపాన్ని సానుభూతిని తెలిపారు. పరామర్శించిన వారిలో ఎంపిటిసి సభ్యులు తాళ్ల లక్ష్మీనరసాయమ్మ, పార్టీ నాయకులు చిక్కం భీముడు, చిక్కాల సతీష్, ఆకుల బుజ్జి, తాళ్ల రవి, .

లక్ష్మికి ఎంఎల్ఎ పొన్నాడ పరామర్శ

ప్రజాశక్తి - తాళ్లరేవు

తాళ్ళరేవు మాజీ ఎంపిటిసి గంజా సూరిబాబు సతీమణి గంజా లక్ష్మిని ఎంఎల్ఎ పొన్నాడ సతీష్ కుమార్ శనివారం పరామర్శించారు. ఏడాదికాలంగా లక్ష్మి అనారోగ్యంతో బాధపడుతూ ఇంటి వద్ద చికిత్స పొందుతున్నారు. ఎంఎల్ఎ వెంట ఎఎంసి చైర్మన్ కుడుపూడి శివన్నారాయణ, పార్టీ మండల అధ్యక్షుడు కాద గోవింద్ కుమార్, రేవు మల్లీశ్వరి, ఆకుల వెంకన్న, బొంతు మోహన్, చలపతి, లక్ష్మీనారాయణ, భూసారపు పద్మారావు, బొంతు శ్రీను, కొల్లు శ్రీను, పండు పాల్గొన్నారు.

వల్లభస్వామికి రూ.3.15 లక్షల ఆదాయం

ప్రజాశక్తి - పెద్దాపురం

మండలంలోని తిరుపతి గ్రామంలోని శంగార వల్లభ స్వామి ఆలయానికి శనివారం వివిధ టిక్కెట్ల ద్వారా రూ.2,36,540, అన్నదానం విరాళాల ద్వారా రూ.64,441, కేశఖండన ద్వారా రూ.14,950 ఆదాయం సమకూరిందని ఆలయ ఇఒ పులి నారాయణమూర్తి తెలిపారు. యాత్రికులకు ఉదయం పులిహోర ప్రసాదం, వేసవిని దష్టిలో పెట్టుకుని మజ్జిగ పంపిణీ, మధ్యాహ్నం మహా అన్నదానం నిర్వహించామన్నారు. ప్రజా ప్రతినిధులు కుంచే బుచ్చిరాజు, కర్రి జగదీష్, సిబ్బంది కష్ణ, సత్యనారాయణ, స్వచ్ఛంద సేవకులు అంజనీకుమార్, గ్రామ ప్రజలు యాత్రికులకు సహాయ సహకారాలు అందించారన్నారు.



ఆలయం వద్ద అన్నదానం చేస్తున్న దృశ్యం

వారాహి యాత్ర విజయవంతానికి పిలుపు

ప్రజాశక్తి-ఉప్పలగుప్తం

అమలాపురంలో ఈనెల 21న జరిగే వారాహి యాత్ర కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని నియోజకవర్గ జనసేన పార్టీ ఇన్ ఛార్జ్ శెట్టిబత్తుల రాజబాబు కోరారు. కూనవరంలో శనివారం వారాహి యాత్ర పోస్టర్‌ను రాజబాబు ఆవిష్కరించారు. వారాహి యాత్ర లో భాగంగా ఆరోజు అమలాపురంలో నిర్వహించే బహిరంగ సభకు అధిక సంఖ్యలో ప్రజలు తరలిరావాలని ఆయన కోరారు. కార్యక్రమంలో జనసేన నాయకులు ఆకుల బుజ్జి, సాకా రాంబాబు తదితరులు పాల్గొన్నారు.



వారాహి యాత్ర పోస్టర్‌ను విడుదల చేసిన రాజబాబు

కరెంట్ కోతలతో ఇబ్బందులు

ప్రజాశక్తి-రామచంద్రపురం

వైసిపి పాలనలో విద్యుత్ లోటుతో, కరెంటు కోతలతో ప్రజలు తీవ్ర ఇబ్బందులుపడుతున్నారని టిడిపి ఇంచార్జి రెడ్డి సుబ్రహ్మణ్యం విమర్శించారు. ఆయన శనివారం మీడియాతో మాట్లాడుతూ వైసిపి అధికారం లోకి వచ్చిన తర్వాత 2022లో రైతులు మొదట 'సారిగా పవర్ హాలిడే ప్రకటించారన్నారు. కరెంటు కోతలతో రైతులు, ప్రజలు ఇబ్బందివ డుతున్నారని, తక్కువ వోల్టేజ్ కారణంగా చేనేత కార్మికులు, ఆక్వారైతులు తీవ్ర అవస్థలు ఎదుర్కొంటున్నారని అన్నారు. రైతులకు 9 గంటలు ఉచిత విద్యుత్ ఇస్తానని చెప్పిన జగన్ ఇచ్చిన హామీ అమలు చేయడంలో విఫలమయ్యారని రెడ్డి సుబ్రహ్మణ్యం ఆగ్రహం వ్యక్తం చేశారు. వైపిపి అధికారంలోకి వచ్చిన నాటి నుండి నేటికీ ఏడు సార్లు చార్జీలు పెంచారని గుర్తు చేశారు. అదనపు లోడ్ చార్జెస్ పేరుతో వినియోగదారులపై రూ.2 వేల నుంచి రూ.5వేలు వసూలు చేస్తోందన్నారు. అన్ని రంగాల్లో వైఫల్యం చెందిన వైసిపి ప్రభుత్వానికి వచ్చే ఎన్నికల్లో గుణపాఠం చెప్పి టిడిపిని రాష్ట్ర అభివద్ధి కోసం గెలిపించాలని రెడ్డి సుబ్రహ్మణ్యం విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ మార్కెట్ కమిటీ ఛైర్మన్ గరికపాటి సూర్యనారాయణ మూర్తి, మాజీ మున్సిపల్ వైస్ ఛైర్మన్ మేడిశెట్టిసూర్యనారాయణ, పంపనశ్రీనివాసు, కొసనా శ్రీనివాసు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న రెడ్డి సుబ్రహ్మణ్యం

అధ్వానంగా పారిశుధ్యం : ఎంఎల్ఎ

ప్రజాశక్తి- పెద్దాపురం

పెద్దాపురం నియోజకవర్గ పరిధిలో పెద్దాపురం, సామర్లకోట రెండు పట్టణాలు, రెండు మండలాల పరిధిలో గ్రామాల్లో పారిశుధ్య నిర్వహణ అధ్వానంగా తయారయ్యిందని ఎంఎల్ఎ నిమ్మకాయల చినరాజప్ప అన్నారు. శనివారం స్థానిక సుధా కాలనీలోని టిడిపి కార్యాలయంలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఈ సమస్యలను అధికారుల దష్టికి తీసుకువెళ్లినా పట్టించుకున్న వారు లేరన్నారు. ప్రజల ఆహ్లాదం కోసం పెద్దాపురం పట్టణంలో శతాబ్ది పార్కు నిర్మించామని, సెలవు రోజుల్లో సుమారు పదివేల మంది పార్కును సందర్శించి కుటుంబ సభ్యులు, పిల్లలతో ఆనందంగా గడిపే వారన్నారు. అటువంటి ఆహ్లాదకరమైన పార్కును నిర్వహించలేక తాళాలు వేయడం దురదష్టకరమన్నారు. ఈ సమావేశంలో టిడిపి పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు రంది సత్యనారాయణ, తూతిక రాజు, టిడిపి మండల అధ్యక్షులు కొత్తెం వెంకట శ్రీనివాసరావు(కోటి), కందుల విశ్వేశ్వరరావు, నూనె రామారావు పాల్గొన్నారు.